క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిగా తరలివచ్చిన భక్తజనసందోహం మధ్య నూతన జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీశోభనామ సంవత్సర వైశాఖ బహుళ దశమి రోజైన ఆదివారం ఉదయం నుంచే భక్తులు దేవస్థానానికి భారీగా తరలివచ్చారు. 7 గంటలకు వేదస్వస్తి, గణపతిపూజ, పుణ్యాహవచనము, గర్తన్యాసము, రత్నన్యాసము, ధాతున్యాసమ, బీజన్యాసము తదితర పూజా కార్యక్రమాలతో మహోత్సవం ప్రారంభమైంది. 9 గంటలకు యంత్రస్థాపనతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకాలు జరిగాయి. భక్తుల సమక్షంలో పండితులు, అర్చకస్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠించారు. నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 10 వేల మంది భక్తులకుపైగా హాజరయ్యారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభ దాతలు చలువాది నాగేశ్వరరావు, చలువాది వెంకట శ్రీనివాసమూర్తి దంపతులు, వెంకటనాగరాజ దంపతులు, గ్రంధి వంశీకృష్ణ దంపతులు, ఒంగోలు నగర ఇన్‌చార్జి మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ, కార్పొరేటర్లు జడా వెంకటేష్, గోపీచంద్, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, ఈమని మదన్‌మోహన్, కరేటి కిరణ్ బాబు, నేమ్మాని హరిప్రియ, దార్ల వెంకట రమణమ్మ, జూటూరి గీతాకుమారి, జగన్నాథం, వల్లెపు మురళి తదితరులు పాల్గొన్నారు.

జై హనుమాన్..!


ప్రత్యేక అలంకరణలో కొప్పోలు చెన్నకేశవస్వామి ఆలయంలోని అభయాంజనేయస్వామి


ఒంగోలు లాయర్‌పేటలోని చిట్టి ఆంజనేయస్వామి


సంతపేట సాయిబాబా ఆలయంలో లక్ష మల్లెలార్చన


మల్లవరంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు


ఇసుకవాగులో ఆంజనేయస్వామి ప్రభను ఊరేగిస్తున్న కౌన్సిలర్ గంగిరెడ్డి సుందరరామిరెడ్డి

- వాడవాడలా హనుమాన్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భారీగా పాల్గొన్న భక్తులు

ఒంగోలు టౌన్:

హనుమాన్ జయంతి ఉత్సవాలను ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలోని పలు ఆంజనేయస్వామి దేవస్థానాల్లో ఘనంగా హనుమజ్జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, కేశవస్వామి పేటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, మాతాశిశు వైద్యశాల వద్ద గల వీరాంజనేయస్వామి దేవస్థానం, లాయరుపేట రైతు బజారు వద్ద ఉన్న చిట్టి ఆంజనేయస్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అన్ని దేవస్థానాల్లో హనుమజ్జయంతి ప్రత్యేక కార్యకరమాలు జరిగాయి. పంచామృత అభిషేకాలు, మాన్యుసూక్త సమితంగా యాగం, సువర్చల ఆంజనేయస్వామికి కల్యాణం నిర్వహించారు. లక్ష మల్లెల అర్చన, ఆకు పూజలు చేశారు. నగరంలోని పలు దేవస్థానాల్లో స్వామివారిని సింధూరంతో అలంకరించారు. మరికొన్ని దేవాలయాల్లో చందనంతో అలంకరించి పూజలు నిర్వహించారు. కొత్తపట్నం బస్టాండులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం 6 గంటల నుంచే పాలాభిషేకం, అరటిపళ్లు, తమలపాకులతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలు అందించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో ఎటు చూసినా కోలాహలం కనిపించింది. అన్ని దేవాలయాలు భక్తులతో సందడిగా, రద్దీగా మారాయి.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: హనుమజ్జయంతి సందర్భంగా చీమకుర్తిలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్నమిట్ట గణపతినగర్‌లోని ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, వారి కుటుంబ సభ్యులు చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చీమకుర్తిలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి స్వామివారి రథాన్ని లాగి భక్తిభావాన్ని చాటుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. చీమకుర్తి మున్సిపాలిటీలోని 20వ వార్డు కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి ఇసుకవాగులో ఆంజనేయస్వామి ఫొటోలతో ప్రభ కట్టి భక్తులతో కలిసి ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.


చీమకుర్తిలో ఆంజనేయస్వామి రథం వద్ద పూజలు చేస్తున్న మారం వెంకారెడ్డి


ఒంగోలులో పూజలు చేస్తున్న భక్తులు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని మల్లవరం కొష్టాల సెంటర్, సీతారాంపురం, పెదకొత్తపల్లి, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్షేత్రపాలకునిగా వెలుగొందుతున్న ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు, యాగ్నికులు శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష మల్లెల అర్చన చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈవో దామా నాగేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.


సంతపేట సాయిబాబా ఆలయంలో లక్ష మల్లెలార్చనకు ఏర్పాట్లు చేస్తున్న భక్తులు

వైభవంగా చేజర్లమ్మ తిరునాళ్లు


పూజలందుకుంటున్న చేజర్లమ్మ


విద్యుత్ దీపాలంకరణలో ఆలయం


తిరునాళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ఒంగోలు రూరల్: మండలంలోని చేజర్ల గ్రామంలో చేజర్లమ్మ తిరనాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వడగాడ్పులను సైతం లెక్కచేయకుండా భారీగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నుంచే ఒంగోలు, కొత్తపట్నం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బారులుదీరి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కొద్ది రోజులుగా జరుగుతున్న తిరునాళ్ల సోమవారంతో ముగియనుండగా, శని, ఆదివారాలు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి తిరునాళ్లలో సందడి చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ ప్రభలపై హైదరాబాదు, విజయవాడ, ఒంగోలుకు చెందిన ప్రముఖ గాయకులు పాటలు పాడి అలరించారు. ఆదివారం సాయంత్రం ఒంగోలు నగరం, కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లోని గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరాగా, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒంగోలు తాలూకా సీఐ రాంబాబు పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, చేజర్ల సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. ఒంగోలు డిపో నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ వారు చేజర్లకు ప్రత్యేక బస్సులు నడపగా, తిరునాళ్ల నిర్వాహకులు కరవది నుంచి చేజర్ల వరకు ఉచితంగా ఆటోలు ఏర్పాటు చేశారు.

62 మంది చిన్నారులకు ఒడుగులు

ఒంగోలు టౌన్: నగరంలోని ఇస్లాంపేటలో గల కమ్యూనిటీ హాలులో 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ ఇంతిజార్ సహకారంతో అల్ హిలాల్ ట్రస్ట్ నిరుపేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఒడుగులు (ఖత్నా) చేయించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమారు 62 మంది పిల్లలకు ఇస్లాం సంప్రదాయం ప్రకారం ఒడుగులు చేశారు. నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు షేక్ మహమ్మద్ ఖత్నా చేశారు. ఒడుగులు చేయించుకున్న పిల్లలకు ఔషధాలు, ఒక టవల్, శీతల పానీయాలు అందజేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఇంతిజార్

నిరుపేద ముస్లింలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ షేక్ ఇంతిజార్ కోరారు. కమ్యూనిటీ హాలులో ఖత్నా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన.. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నవరత్నాలలో భాగంగా అందిస్తున్న పథకాలతో ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. 2013 నుంచి ప్రతి ఏటా వేసవిలో ముస్లిం పేద పిల్లలకు ఖత్నా చేయిస్తున్నామని తెలిపారు. అల్ హిలాల్ ట్రస్ట్ అనేక ప్రజా ప్రయోజన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఖత్నాతో పాటు పేద ముస్లిం యువతుల వివాహానికి సహాయం చేస్తున్నట్లు ట్రస్ట్ ఒంగోలు విభాగం ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ సాదిక్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నూర్జహాన్ జాకిర్, చెన్నయ్‌కి చెందిన డాక్టర్ ఖలీల్ బాషా, ఇస్లామిక్ స్కాలర్ ఎండీ షరీఫ్, ప్రొఫెసర్ ఖాజా రసూల్, ట్రస్ట్ కార్యదర్శి ఎల్‌ఆర్ అన్వర్‌బాషా, కోశాధికారి షేక్ అబ్దుల్ సమి తదితరులు పాల్గొన్నారు.



ఖత్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఇంతిజార్

తల్లులను గెలిపించాల్సిన బాధ్యత బిడ్డలదే

ఒంగోలు టౌన్: బిడ్డల కోసం జీవిత ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తల్లులను గెలిపించాల్సిన బాధ్యత బిడ్డలదేనని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డులో గల మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో ఆదివారం నరసం, మహిళాభ్యుదయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో మదర్స్ డే నిర్వహించారు. శాంతమ్మ, మస్తానమ్మ, కోటేశ్వరమ్మ అనే తల్లులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు యువతులు వారి జీవితానుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సింహాద్రి జ్యోతిర్మయి, తమ్మిశెట్టి రమాదేవి, బీరం అరుణ, నాళం నరసమ్మ, మారెపల్లి సూర్యకుమారి, ట్రాన్స్‌జెండర్ నాయకురాలు బోను దుర్గా, శక్తిసదన్ డైరెక్టర్ కె.శాంతిలత, సీహెచ్ కనకదుర్గ, గుంటపల్లి శ్రీదేవి, వేమ సుశీల తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనులు వేగవంతం


సబ్‌స్టేషన్ ఫౌండేషన్ పనులు చేస్తున్న కూలీలు

- రూ.20 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం
- రెండు నెలల్లో పూర్తికానున్న పనులు

కొత్తపట్నం: మండలానికి మెరుగైన విద్యుత్ అందించడానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకున్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ శాఖ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయించి మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో విద్యుత్ స్తంభాలు, కండక్టర్ వైరు, టవర్లు కొత్తవి వేశారు. అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. మరింత నాణ్యమైన విద్యుత్ అందించడానికి మరో రూ.20 కోట్లను ఏపీ ట్రాన్స్‌కో నుంచి మంజూరు చేయించి 132/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. సబ్‌స్టేషన్‌కు ఫౌండేషన్ పూర్తి చేశారు. ఒంగోలు నుంచి సబ్‌స్టేషన్ వరకు 50 టవర్లు వేయాల్సి ఉండగా, ఇప్పటికే 20 పూర్తి చేశారు. మిగతా టవర్ల పనులు జరుగుతున్నాయి. మధ్యలో వర్షాల కారణంగా టవర్ల ఏర్పాటులో జాప్యం జరగ్గా, ప్రస్తుతం ఆ పనులు ఊపందుకున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తే మండలంలో లో ఓల్టేజీ సమస్య తీరినట్లేనని చెప్పారు. మండలంలో ఎక్కువగా విద్యుత్ మీదే ఆధారపడి ఆక్వా, వ్యవసాయ రైతులు, రొయ్య పిల్లల హేచరీలు, చిన్న చిన్న ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. లో ఓల్టేజీ సమస్యతో ఎన్నో మోటార్లు, ఇళ్లలో వాడుకుంటున్న వివిధ రకాల సామగ్రి కాలిపోతున్నాయి. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే లో ఓల్టేజీ సమస్య తీరుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


వేగంగా జరుగుతున్న బిల్డింగ్ పనులు